

శుక్రవారం సిద్దిపేట జిల్లా వెంకట్రావుపేటలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న విద్యుత్తు శాఖ డీఈ భానుప్రకాశ్ తదితరులు

## రైతులకు కరెంట్ కష్టాలు రానియ్యం

### వెంకట్రావుపేటలో ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలన

### సమస్యను పరిష్కరిస్తామని అధికారుల హామీ

తొగుట/మిరుదొడ్డి, ఏప్రిల్ 5 : రైతులకు కరెంట్ కష్టాలు రానియ్యమని విద్యుత్తు శాఖ అధికారులు హామీ ఇచ్చారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలం వెంకట్రావుపేటలో అస్తవ్యస్త కరెంట్‌తో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని, అర్ధరాత్రి ప్రాణాలతో చెలగాటం అనే కథనం శుక్రవారం 'నమస్తే తెలంగాణ' దినపత్రిక మెయిన్‌లో ప్రచురితమైంది. ఈ కథనానికి విద్యుత్తు శాఖ గజ్వేల్ డీఈ భానుప్రకాశ్, తొగుట ఏడీఏ శ్రీనివాస్‌రావు, ఏఈ శ్రీనివాస్‌రావు స్పందించారు. ఈ అధికారులు శుక్రవారం వెంకట్రావుపేటలోని కత్తుల రాములు, కత్తుల లింగం, మిరుదొడ్డి రాజశేఖర్ పొలాల వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు చేరుకుని రైతులతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఈ భానుప్రకాశ్ మాట్లాడుతూ.. ఇక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు అదనంగా మరో 25 కేవీ ట్రాన్స్ ఫార్మర్‌ను, 3 ఎర్తింగ్ బిల్లలను నూతనంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా విద్యుత్తు సమస్యలు తలెత్తితే వెంటనే విద్యుత్తు శాఖ అధికారుల దృష్టికి తేవాలన్నారు. తమ సమస్య పరిష్కారానికి కృషిచేసిన నమస్తే తెలంగాణకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

## దూరదర్శన్ శాంతిస్వరూప్ కన్నుమూత

- మూగబోయిన తొలి తెలుగు న్యూస్‌రీడర్ స్వరం
- యశోద దవాఖానలో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- 28 ఏండ్లపాటు న్యూస్ రీడర్‌గా, యాంకర్‌గా సేవలు
- రచయితగానూ ప్రశంసలు అందుకున్న శాంతిస్వరూప్



హైదరాబాద్ సిటీబ్యూరో/రామంతాపూర్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): 'నమస్కారం.. ఈ రోజు వార్తల్లోని ముఖ్యాంశాలు' అంటూ ఆరంభించి ఇరుగుపొరుగు వారితో ముచ్చటిస్తున్నట్టుగా ఆసక్తిని రేకెత్తిస్తూ వార్తలను ప్రజల దరిచేర్చిన తొలి తెలుగు న్యూస్ రీడర్ శాంతిస్వరూప్ (74) స్వరం మూగబోయింది. 28 ఏండ్లకుపైగా వార్తా ప్రపంచాన్ని శాసించిన ఆ వ్యక్తి గుండెపోటుతో మలక్‌పేటలోని యశోద దవాఖానలో రెండురోజులుగా చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఆయన మరణవార్తతో అభిమానులు శోకసంద్రంలో మునిగిపోయారు. అభిమానులు, ప్రముఖులు, కుటుంబసభ్యులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు. రామంతాపూర్‌లోని శ్రీరామన్నపురం టీవీ కాలనీలో స్వగృహానికి మధ్యాహ్నం 12 గంటలకు ఆయన భౌతికకాయాన్ని తీసుకొచ్చారు. అనంతరం మధ్యాహ్నం 3:30 గంటల నుంచి అంతిమయాత్ర సాగింది. అంబర్‌పేట శ్మశానవాటికలో ప్రజల అశ్రునయనాల నడుమ అంత్యక్రియలు పూర్తయ్యాయి. ఆయన ఇకలేరన్న వార్తతో దూరదర్శన్ కార్యాలయం బోసిపోయింది. సాహిత్యంపై మక్కువతో శాంతిస్వరూప్ కొన్ని నవలలు కూడా రాశారు. శాంతిస్వరూప్ సీనియర్ యాంకర్ రోజారాణిని వివాహం చేసుకోగా, వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. 1983లో నవంబర్ 14న రామంతాపూర్ దూరదర్శన్ చానల్‌లో శాంతిస్వరూప్ తొలిసారిగా వార్తలు చదివారు. 2011లో ఆయన ఉద్యోగ విరమణ పొందారు. ఆయన సేవలకు లైఫ్ టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు వరించింది.

# నమ్మి ఓటేస్తే నిండా ముంచిండ్రు

**రేవంత్‌కు రాజకీయ వలసపైనే శ్రద్ధ • రైతులను గాలికొదిలేసి రాజకీయాలు • రుణమాఫీ, తులం బంగారం ఎక్కడ? : హరీశ్‌రావు**

- కాంగ్రెస్‌ను ప్రజలెవరూ నమ్మతలేరు
- బీజేపీ పాలనలో పెరిగిన పేదరికం
- ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నాలుగు డీఏలు చెల్లించాలి
- ప్రభుత్వానివి కోడ్ రాజకీయాలు
- మెదక్ జిల్లాలో బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశాల్లో మాజీ మంత్రి హరీశ్‌రావు



మెదక్ జిల్లా పాపన్నపేటలో బీఆర్‌ఎస్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు. చిత్రంలో మెదక్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

సిద్దిపేట/ గజ్వేల్, ఏప్రిల్ 5(నమస్తే తెలంగాణ ప్రతినిధి): నమ్మి ఓటేసిన ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం నిండా ముంచిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. శాసనసభ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మడం లేదని పేర్కొన్నారు. డిసెంబర్ 9న రూ.2 లక్షల పంట రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్ మాట నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. శుక్రవారం మెదక్ జిల్లా పాపన్నపేట, శంకరంపేట మండలకేంద్రాల్లో నిర్వహించిన బీఆర్‌ఎస్ సన్నాహక సమావేశాల్లో మెదక్ ఎంపీ అభ్యర్థి పీ వెంకట్రామిరెడ్డి, పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు అది చేస్తాం, ఇది చేస్తామని ఇష్టం వచ్చినట్టు హామీలు ఇచ్చిన కోతలరాయుడు రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చి క్వింటాల్‌ను రూ.2,500 కొంటామని చెప్పి ఆ ఊసే మరిచారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సీఎం వ్యవసాయం మీద కాకుండా రాజకీయ వలసలపై దృష్టిసారించారని ఆరోపించారు. హామీలను అమలుచేయని కాంగ్రెస్‌కు రానున్న ఎన్నికల్లో ప్రజలు సురుకు పెట్టాలని కోరారు. రైతుబంధు కింద పెంచుతామని చెప్పిన రూ.15 వేలు ఏమయ్యాయని నిలదీశారు. రైతులకు కేసీఆర్ ప్రథమ ప్రాధాన్యం ఇస్తే, రేవంత్ మాత్రం వారిని చివరన పడేశారని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు కరెంటు, నీళ్లు పుష్కలంగా అందాయని, రైతుబంధు, రైతుబీమాతో చేయూత లభించిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కరెంటు కోతలు మొదలయ్యాయని, తాను మాట్లాడుతుండగా కరెంట్ పోవడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

### కాంగ్రెస్ మెడలు వంచాలంటే బీఆర్‌ఎస్ గెలవాలి

**అసెంబ్లీ** ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలపై అసెంబ్లీలో తాము ప్రభుత్వాన్ని నిలదీసి దాని మెడలు వంచాలంటే బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని హరీశ్‌రావు కోరారు. పార్లమెంటు ఎన్నికలు, జీహెచ్‌ఎంసీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో కారునే గెలిపించాలని పిలుపునిచ్చారు. రేవంత్‌రెడ్డి మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామని మోసం చేశారని, అక్కచెల్లెళ్లు కారు మీద ఓటు గుద్దితే రేవంత్ గూబ గుయ్యిమనాలని పేర్కొన్నారు. కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇస్తామని చెప్పి ఎగ్గొట్టారని, వచ్చే లక్ష కూడా రావడం లేదని తెలిపారు. నిరుద్యోగులకు రూ.4 వేలు ఇస్తామని చెప్పి, ఇప్పుడేమో ఆ హామీ ఇవ్వలేదని డిప్యూటీ సీఎం అసెంబ్లీ సాక్షిగా పచ్చి అబద్ధం చెప్పారని మండిపడ్డారు. ఆడపిల్లలకు ఇస్తామన్న స్కూటీని కూడా ఇవ్వలేదని పేర్కొన్నారు.

### ఉపాధ్యాయులనూ మోసగించారు

అధికారంలోకి వచ్చాక ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను చెల్లిస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని, ఈ నాలుగు నెలల కాలంలో మరో డీఏ పెండింగ్ పడిందని మొత్తం నాలుగు డీఏలను చెల్లించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మార్చి 31న చాలా మంది ఉద్యోగులు రిటైర్ అయ్యారని వారికి ఇవ్వాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకుండా మూడేండ్లపాటు బాండ్లు ఇస్తామని లీకులు ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులపై ఏసీబీతో దాడులుచేయిస్తున్నదని ఆరోపించారు.

### ముస్లింలకు అన్యాయం

ఒక్క ముస్లింకు కూడా మంత్రి పదవి ఇవ్వకుండా కాంగ్రెస్ వారిని మోసం చేసిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ముస్లింలు లేకుండా ప్రభుత్వం ఉండదనే ఆనవాయితీకి కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం పాడిందని మండిపడ్డారు. పదేండ్లలో రంజాన్ మాసంలో గిఫ్టుల పంపిణీ ఎప్పుడూ ఆగలేదని, కానీ ఈసారి ప్రభుత్వం చేతకాక ఇవ్వలేదని విమర్శించారు. సమావేశంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మెదక్ ఎంపీ అభ్యర్థి వెంక్రటామిరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీ పాలనలో పేదరికం.. నిరుద్యోగం

**పదేండ్ల** బీజేపీ పాలనలో పేదరికం, నిరుద్యోగం పెరిగిందని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు భారీగా పెరిగాయని హరీశ్‌రావు ఆరోపించారు. రాముడి పేరుతో బీజేపీ రాజకీయం చేస్తున్నదని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఎలక్షన్ కోడ్ రాజకీయాలు, బీజేపీ ఈడీ రాజకీయాలు చేస్తున్నాయని విమర్శించారు.

## ఆ మాటనడానికి సిగ్గులేదా?

### బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకొని పార్టీ ఫిరాయింపులపై చట్టం తెస్తరా?

**హామీలు నిలబెట్టుకోని చరిత్ర మీది • బోనస్ పేరుతో కాంగ్రెస్ బోగస్**

**రైతుల ఆత్మహత్యలకు బాధ్యత మీదే • రాహుల్‌గాంధీకి హరీశ్ లేఖ**

హైదరాబాద్, ఏప్రిల్ 5 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను చేర్చుకొని, వారికే ఎంపీ టికెట్లు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ నైతికత గురించి మాట్లాడటం సిగ్గుచేటని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలను నెరవేర్చిన చరిత్ర కాంగ్రెస్ చరిత్రలోనే లేదని విమర్శించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి హరీశ్‌రావు శుక్రవారం బహిరంగలేఖ రాశారు. ఆరు గ్యారెంటీల పేరుతో అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్‌కు మాట్లాడే నైతిక హక్కు లేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకొచ్చి 4 నెలలైనా ఒక్క హామీనీ నెరవేర్చలేదని విమర్శించారు.

### అర'చేతి'లో స్వర్గం.. ఆపై మోసం

ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టేందుకు అరచేతిలో స్వర్గం చూపిస్తూ హామీలు ఇవ్వడం, ఆ తర్వాత వాటిని అమలు చేయలేక చేతులెత్తేయడం కాంగ్రెస్‌కు మామూలేనని, ఈ విషయం ఎన్నోసార్లు రుజువైందని హరీశ్ ఆ లేఖలో ఆరోపించారు. 2004, 2009 ఎన్నికల సందర్భంగా మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కదానినీ అమలుచేయలేదని గుర్తుచేశారు. తెలంగాణలోనూ ఇప్పుడు హామీలను విస్మరించారని ధ్వజమెత్తారు. మళ్లీ ఇప్పుడు ఏ నైతికత ఉందని మ్యానిఫెస్టో విడుదలకు వస్తున్నారో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణ చాప్టర్‌లోని 13వ పాయింట్ కింద ప్రజాప్రతినిధులు ఎవరైనా పార్టీ మారితే ఆ వెంటనే సభ్యత్వం పోయేలా చట్టం చేస్తామని ఈసారి మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చారని, మ్యానిఫెస్టో ఇలా విడుదల చేశారో? లేదో? తెలంగాణలో అందుకు భిన్నంగా జరిగిందని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకుని వారికే ఎంపీ టికెట్లు ఇచ్చారని, అలాంటి మీరు ఫిరాయింపుల గురించి మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆరు గ్యారెంటీల పేరుతో హామీలు గుప్పించారని, మాది గ్యారెంటీ అని, వారెంటీ మీరు, ప్రియాంకగాంధీ, ఖర్గే ట్వీట్లు చేశారని గుర్తుచేశారు. మీపై నమ్మకంతో గెలిపించిన ప్రజలను మోసం చేశారని, 90 రోజుల్లో హా మీలు అమలుచేస్తామని చెప్పి 120 రోజులైనా హామీలు నెరవేరలేదని విమ ర్శించారు.

### మోసాల కాంగ్రెస్‌తో రైతుల గోస

కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలోని మొట్టమొదటి హామీ అయిన మహాలక్ష్మి పథకం నుంచి చివరి హామీ అయిన చేయూత పథకం వరకు కాంగ్రెస్ అన్నింటినీ విస్మరించిందని లేఖలో హరీశ్ మండిపడ్డారు. మహాలక్ష్మి పథకం కింద పేద మహిళలకు నెలకు రూ. 2,500 చొప్పున బ్యాంకు అకౌంట్లో జమ చేస్తామని చెప్పారని, కానీ నేటి వరకు ఒక్క మహిళకు కూడా ఆర్థికసాయం అందలేదని పేర్కొన్నారు. మీ తల్లి సోనియాగాంధీ పుట్టిన రోజైన డిసెంబర్ 9న రైతులకు రుణమాఫీ చేస్తామని ఇప్పటికీ దానిగురించి మాట్లాడటం లేదని విమర్శించారు. తుక్కుగూడ సభలోనైనా రూ. 2 లక్షల రుణమాఫీకి సంబంధించి స్పష్టమైన ప్రకటన చేయాలని రైతుల పక్షాన కోరుతున్నట్టు పేర్కొన్నారు. రైతుబంధు రూ. 15 వేలు, పంటలకు క్వింటాలుకు రూ. 500 బోనస్, వ్యవసాయ కూలీలకు రూ. 12 వేలు వంటి వాటిపై నేటికీ స్పష్టత లేదని తెలిపారు. 24 గంటల ఉచిత విద్యుత్ అందక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ అధికారంలోకొ చ్చాక రాష్ట్రంలో ఇప్పటివరకు 210 మం ది రైతులు మరణించారని తెలిపారు. దీనికి కారకులైన మీరు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రూ. 4 వేల పెన్షన్, నిరుద్యోగులకు రూ. 4 వేల భృతి, ఆటోకార్మికులకు రూ. 12 వేలు వంటివేవీ అమలుకావడం లేదని లేఖలో పేర్కొన్నారు.


